**కథ**

# మంచి మనసులు

**సమీర**

**సమయం పన్నెండు గంటలు దాటినా శీతాకాలం కావటంతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. సన్నగా గాలులు వీస్తున్నాయి. అందరూ పనులకు వెళ్లిపోవటంతో వీధి మొత్తం నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడా అలికిడే లేదు.**

వీధి అరుగుమీద పడక కుర్చీలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాను. రెండు గంటల నుండీ చదివిందే చదివి విసుగుపుట్టింది. కానీ నాకంతకంటే ఏమీ పని లేదు. టీచరుగా పనిచేసి మూడేళ్ల క్రితమే రిటైరయ్యాను. ఉద్యోగం నిమిత్తం ఎన్ని ఊళ్లు తిరిగినా రిటైరయ్యాక నేను పుట్టి పెరిగిన ఊరికే వచ్చి స్థిరపడిపోయాను.

ఇదొక పల్లెటూరు, స్వచ్ఛమైన పల్లెటూరు. ఈ ఊరు, ఇక్కడ మనుషులు నా ప్రాణం. ఉదయం అయిదింటికి లేస్తాను. స్నానం చేసి బయటికి వెళ్తాను. కొంచెం సేపు అలా ఊరంతా తిరిగి అందర్నీ పలుకరించి వస్తాను. నూట యాభై కుటుంబాలను మించి ఉండదు మా ఊరి జనాభా. అందులో తొంభై శాతం మంది నిరక్షరాస్యులే. మిగిలిన పది శాతం ఇప్పుడిప్పుడు బడికెళ్తున్న చిన్నారులు. పెద్దలందరూ కూలి పనులు చేసుకుంటారు. కొంతమంది పండ్లు, కూరగాయలు పండించి పట్నం తీసుకెళ్లి అమ్ముకుంటారు. ఈ ఊరిలో ఎలాంటి వసతులూ లేవు. పిల్లలందరూ మూడు మైళ్లు నడిచి బడికెళ్తారు. మా ఊరిలో బడి స్థాపించాలనున్నా నా ఆర్థిక స్థోమత సహకరించలేదు. ఏ ప్రభుత్వమూ కనికరించలేదు. ఎంతో కష్టపడి చిన్న ఆసుపత్రి మాత్రం కట్టించగలిగాను.

తెల్లవారినప్పటి నుండీ సందడిగా ఉండే ఊరు ఎనిమిదయ్యే సరికి నిశ్శబ్దంగా మారిపోతుంది. అందరూ పనుల నిమిత్తం వెళ్లిపోతారు. నేను మాత్రం పేపర్ చదువుకుంటూ కూర్చుంటాను. ఈ మధ్య పేపర్ చదవాలన్నా విసుగ్గా ఉంటోంది. అన్నీ చావు వార్తలే. ప్రపంచంలో ఎక్కడ చూసినా అన్యాయాలు, అక్రమాలు.

ఈ రోజు పేపర్ ఇప్పటికి రెండుమూడుసార్లు చదివాను. పేపర్ చదవటంలో ఎంతగా మునిగిపోయినా నా చుట్టూ జరుగుతున్నది గమనిస్తూనే ఉన్నాను. నా కోడలు మహాలక్ష్మి ఇప్పటికి రెండు మూడుసార్లు గుమ్మంలోంచి రోడ్డువైపు తొంగిచూసి వెళ్లింది. ఆమె దేని కోసం ఎదురుచూస్తోందో నాకు తెలుసు. అందుకే ఆమెను గమనించనట్లే ఉన్నాను. రోడ్డు మీద ఏదో అలికిడయితే అటువైపు చూశాను. పోస్ట్‌మాన్ సైకిల్‌స్టాండ్ వేస్తున్నాడు.

“రావయ్యా గోపాలం. ఏంటి కొత్త సైకిల్ కొన్నట్లున్నావ్?” పలుకరించాను.

“భలేవారు మాస్టారూ. కొత్త సైకిల్ కొనేలాగే ఉంది నా పరిస్థితి. ఊళ్లోకి రాగానే నా సైకిల్ టైరు పంచరైంది. దాన్ని సైకిల్ షాపులో పడేసి ఆ షాపువాడి సైకిలేసుకొచ్చాను” అంటూ వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు.

అతని మాట వినపడిందో ఏమో, మహాలక్ష్మి పరుగులాంటి నడకతో వచ్చి గుమ్మంలో నిలబడింది.

పెన్నూ, కాగితం ఇచ్చాడు గోపాలం. సంతకం చేశాను. జేబులోంచి డబ్బు తీసి నా చేతిలో పెట్టి “లెక్క చూసుకోండి మాస్టారూ” అన్నాడు.

చిన్నగా నవ్వి ఆ డబ్బు జేబులో పెట్టుకున్నాను.

“మీలోని ఆ మంచితనమే మాస్టారూ మిమ్మల్నీ ఊరి ప్రజల మనసుల్లో దేవుడిగా నిలబెట్టింది. మీకు మోసమంటే తెలీదు. ఎదుటివారు మిమ్మల్ని మోసం చేస్తారన్న ఆలోచనా మీకు రాదు. నా సర్వీసులో ఎంతోమందిని చూశాను. వంద రూపాయలు కాదు కదా పది రూపాయలు ఎం.ఓ. వచ్చినా లెక్క సరిగ్గా ఉందా, నోట్లు మారతాయా లేదా అని గంటల తరబడి పరీక్ష చేసిగానీ తీసుకోరు. మీరు మాత్రం ఏనాడూ నన్ననుమానించలేదు. డబ్బు లెక్కపెట్టి నా నిజాయితీని అవమానించలేదు. మిమ్మల్ని నా జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను. వెళ్తాను మాస్టారూ” నాకు నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

గోపాలం మంచివాడు. నిజాయితీపరుడని పేరు సంపాదించుకున్నాడు. ప్రతి నెలా నా పెన్షన్ డబ్బు రెండు వేలూ తీసుకొస్తాడు. ఎప్పుడైనా పది రూపాయలు చేతిలో పెట్టినా వద్దంటాడు. పైగా డబ్బు లెక్కపెట్టకుండా తీసుకున్నందుకు నన్ను పొగుడుతూ ఉంటాడు. ఆ డబ్బు లెక్కపెడితే అతణ్ణి కాదు ప్రపంచంలో నిజాయితీ అన్నదాన్నే అవమానించినట్టు.

“ఇప్పటికే చాలా ఆలస్యమైంది. భోజనానికి రండి మావయ్యగారూ” మహాలక్ష్మి పిలిచింది.

“వస్తాన్లేమ్మా. మీ ఆయన భోజనానికొచ్చాడుగా. వాడి సంగతి చూడు. నేను నెమ్మదిగా తరువాత వచ్చి తింటాను”

“అదేంటి మావయ్యగారు ఇలా వేళకి తినకుండా ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎలా. రండి వడ్డించేస్తాను.”

కోడలి ఆప్యాయతకి మురిసిపోలేదు నేను. వానాకాలంలో మెరుపు మెరిసి మాయమైనట్లు ఆమె ఆప్యాయత నా పెన్షన్ వచ్చిన రోజున ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంది. ఆ రెండు వేలూ తన చేతిలో పడేవరకే ఈ అబద్ధపు ప్రేమలూ అలలై ఎగసిపడే ఆప్యాయత నటనలు.

మరొకసారి పిలిపించుకోవటమెందుకని భోజనానికి లేచాను. లోనికి వెళ్లబోతుండగా వీరయ్య వచ్చాడు.

“దండాలయ్యగారూ” తలపాగా తీసి చేతితో పట్టుకున్నాడు.

ఎందుకో దిగులుగా కనిపిస్తున్నాడు.

“ఏంటి వీరయ్యా ఈ సమయంలో వచ్చావ్. ఏంటి విషయం?”

వీరయ్య మాట్లాడలేదు. ఏదో చెప్పాలనుకుంటున్నాడు. చెప్పలేక నేల చూపులు చూస్తున్నాడు.

“ఏమిట్రా నీళ్లు నములుతున్నావ్. ఎంతవరకూ వచ్చాయి నీ కూతురి పెళ్లి పనులు?”

నా ప్రశ్నకి తలెత్తి నా వైపు చూశాడు. దీనమైన వాడి చూపులు చూస్తేనే తెలుస్తోంది ఏదో సహాయం కోరి వచ్చాడని. రెండు రోజుల్లో వాడి కూతురి పెళ్లి. తల్లిలేని పిల్లని ప్రాణంగా పెంచుకున్నాడు. పెళ్లి చేయటానికి ఇబ్బంది పడుతుంటే పక్క ఊరిలో నాకు తెలిసిన సంబంధం చూసి పెళ్లి కుదిర్చాను. ఎంత కట్నకానుకలు ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా పెళ్లన్న తర్వాత ఎన్నో ఖర్చులుంటాయి. కూలిపని చేసే వీరయ్యకి అది కూడా తలకు మించిన భారమే. అది చెప్పటానికే వచ్చి ఉంటాడు. చెప్పలేకపోతున్నాడు.

వాడినింకేమీ అడక్కుండా జేబులోంచి రెండు వేలూ తీసి చేతిలో పెట్టాను.

వీరయ్య కళ్లలో నీళ్లు తిరిగాయి. తువాలుతో కళ్లొత్తుకుని చేతులు జోడించాడు.

“ఏంటి వీరయ్యా ఇది. వెళ్లి పెళ్లి ఏర్పాట్లు చూడు. నువ్వు పెళ్లికూతురి తండ్రివిరా. హుషారుగా ఉండాలి. పెళ్లి చక్కగా జరిపించాలి. వెళ్లి రా.”

డబ్బు కళ్లకద్దుకుని, నా వైపు తృప్తిగా చూసి వెళ్లిపోయాడు.

వీరయ్య అలా వెళ్లగానే విసవిసా లోపలికెళ్లిపోయింది మహాలక్ష్మి. విషయం మొగుడి చెవిలో వేసిందేమో తింటున్న అన్నం కంచం ముందు నుంచి లేచి విసు

రుగా వచ్చాడు రాఘవ. రక్తం పంచుకు పుట్టటం వరకే వాడు నా కొడుకు. వాడు నా కొడుకని నేను గర్వపడిన సందర్భాలు చాలా తక్కువ.

"నాన్నా, ఏంటి మీరు చేసిన పని?" రావటంతోటే నా మీద విరుచుకుపడ్డాడు.

"ఏ పని?" అర్థంకానట్టే అడిగాను.


"ఎందుకు తెలియనట్టడుగుతారు? మీ పెన్షన్ డబ్బు వచ్చింది వచ్చినట్లు ఆ వీరయ్య చేతిలో పోయలేదా?"

"ఇప్పుడేమయింది?"

"అవటానికేముంది? దానధర్మాలంటూ ఉన్న కాస్త ఆస్తిని హారతి చేశారు. చివరికి ఈ ఇల్లొకటే మిగిలింది. ఇప్పుడు పెన్షన్ డబ్బులు కూడా పంచిపెడుతున్నారు. సంపాదించే అయిదు వేలూ సరిపోక నేనెన్ని అవస్థలు పడుతున్నానో చూస్తున్నారు కదా. రోజూ డ్యూటీకి వెళ్లి రావటానికి నా స్కూటర్ పెట్రోల్‌కయ్యే ఖర్చే తడిసి మోపెడవుతోంది. ఇలాంటప్పుడు ఆ రెండు వేలూ వేన్నీళ్లకి చన్నీళ్లలా పనికొస్తాయిగా. అయినా నాకు తెలీకడుగుతాను ఊళ్లో వాళ్ల బాధలు చూసి చలించిపోతారు కానీ కన్నకొడుకు బాధపడుతుంటే అర్థం చేసుకోలేరా?"

పదునైన ఆయుధమేదో సూటిగా గుండెల్లో దిగినట్లనిపించింది. అరచేతుల్లో పెట్టుకుని పెంచిన నా కొడుకేనా నన్నిలా నిలదీస్తున్నది?

"బాగా అడిగావురా రాఘవా. నాకు పెళ్లయిన పన్నెండేళ్లకి నువ్వు పుట్టావు. అంతవరకూ పిల్లల కోసం పరితపించి కనిపించిన దేవుడికల్లా మొక్కిన మీ అమ్మ నిన్ను కన్నులారా చూసుకోకుండానే కన్నుమూసింది. ఆ క్షణం నుండీ నీకు నేనే తల్లినయ్యాను. నీ ఆకలి తెలుసుకుని పాలుపట్టాను. నిద్రపోకుండా ఏడుస్తుంటే నేను నిద్రమానుకుని నిన్ను లాలించాను. నడిస్తే నీ కాళ్లు నొప్పెడతాయని చాలాకాలం నిన్నెత్తుకుని స్కూల్‌కి తీసుకెళ్లాను. కాలేజీలో చేరాక సైకిల్ కొనిచ్చాను. చదువు పూర్తి కాగానే ఉద్యోగమిప్పించాను. బస్సుల్లో తిరిగితే అలసిపోతావని స్కూటర్ కొన్నాను. ఇప్పుడిదంతా ఎందుకు చెప్తున్నాడు అనుకుంటున్నావా? నేను నీకు చేసిన వాటిలో ఏదీ నువ్వడగలేదు.



నీకేది అవసరమో ఆలోచించి నువ్వడగకముందే అన్నీ సమకూర్చిపెట్టాను. కానీ ఈ రోజు నువ్వు నన్ను 'నా బాధ అర్థం చేసుకోలేరా' అని అడుగుతున్నావ్. నువ్వలా అడగటం ఎంతవరకూ సమంజసమో ఆలోచిస్తావని ఇదంతా చెప్పాను"

రాఘవ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్న భర్త వంక చురచురా చూసింది మహాలక్ష్మి.

"చూడు రాఘవా! మనిషికి డబ్బు అవసరమే కాదనను. అందుకే ప్రతి నెలా నా పెన్షన్ డబ్బు నీకు వేన్నీళ్లలో చన్నీళ్లలా తోడౌతాయనే నీకిచ్చేస్తున్నాను. కానీ ఈ రోజు నా సహాయం కోరి వచ్చి మనింటిముందు దీనంగా నుంచున్నాడే వీరయ్య, అతనికి నేనిచ్చిన డబ్బు చన్నీళ్లు కాదురా అమృతం. వాళ్ల జీవితాలను నిలబెట్టే అమృతంరా. మన జీవితాలు డబ్బు చుట్టూ తిరుగుతున్నా జీవితమంటే డబ్బే కాదు. మనసు-మమత, మంచితనం, మానవత్వం అనేవే జీవితానికి పరమార్థం. అంతే కాదురా ఎంత సంపాదించినా ఏ స్థాయికి చేరుకున్నా ఎదుటి మనిషి కోసం ఒక కన్నీటి బొట్టు రాల్చలేని వాడి జీవితం వ్యర్థమే"

నేనిక అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడలేక నా గదిలోకి వచ్చేశాను. అయినా బయటి నుండి నా కొడుకు కోడలు మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

"ఏమిటండీ మీరు. ఆయనేదో నాలుగు ముక్కలు గడగడా మాట్లాడేసరికి కొయ్యబొమ్మలా నిలబడిపోయారు. ఇందుకేనా ఆవేశంగా బయటికొచ్చారు? అందరూ దేవుడని పొగడాలని ఆయన ధర్మాత్ముడిలా దానధర్మాలు చేస్తూ ఉంటే మీరిలా మూగమొద్దులాగే ఉండండి. ఏదో ఒకరోజు ఉన్న ఈ ఒక్క ఇల్లూ కూడా ఎవడికో ఇచ్చేసి మనల్ని రోడ్డుమీద నిలబెడతారు"

"ఏం చెయ్యమంటావే చూశావు కదా. ఏదైనా అంటే చాలు గంటలు గంటలు నీతిబోధ చేస్తాడాయన. ఈ జన్మకి ఆయన్ని మార్చటం ఎవరివల్లా కాదు. నాకు టైమయ్యింది నేను వెళ్తున్నా"

రాఘవ అలా ఆఫీసుకెళ్లగానే తన గదిలోకెళ్లి తలుపేసుకుంది మహాలక్ష్మి.

కొంతసేపటి క్రితం భోజనానికి రమ్మని బ్రతిమిలాడిన మనిషి ఇప్పుడు నాకు భోజనం పెట్టటం అనవసరమన్నట్టుగా గదిలోకెళ్లిపోయింది. ఈ లోకంలో డబ్బుకే గానీ మనిషికీ, మనసుకీ విలువ లేదా? ఈ ఇంట్లో నాకొచ్చే పెన్షన్ డబ్బుకే కానీ నాకు విలువ లేదు. నా రక్తం పంచుకుపుట్టిన బిడ్డే నాకు విలువివ్వటం లేదు. దానికి నాకు బాధ లేదనను. కానీ మానవతా విలువలు తెలీని, ఎదుటి మనిషి కన్నీళ్లు చూసి కాస్తయినా చలించని కఠినమైన మనసున్న నా కొడుకుని చూసి నేనెంతో సిగ్గుపడుతున్నాను.

ఆలోచనలతో మనసు సుడులు తిరిగే సంద్రంలా తయారయింది. వాటిని కట్టడి చేయటానికి ప్రయత్నిస్తూ మంచంపై వాలిపోయాను.

* * *

గడియారం అయిదు గంటలు కొట్టింది. ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. మధ్యాహ్నం ఆలోచనలతో అలుపెరగక పోరాడి ఎప్పుడు నిద్రలోకి జారిపోయానో తెలియదు. మళ్లీ ఇప్పుడు మెలకువ వచ్చింది.

బయటి నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. రాఘవ గట్టిగా మాట్లాడుతున్నాడు. మహాలక్ష్మి ఏడుస్తోంది. మధ్యలో ఎవరినో తిడుతోంది. లేచి మెల్లగా బయటికొచ్చాను.

"ఏం జరిగిందిరా? కోడలెందుకేడుస్తుంది?"

"ఏం జరిగితే మీకెందుకు? ఊళ్లో ఎవడికేమొచ్చినా క్షణాల్లో మీకు తెలిసిపోతుంది. కానీ ఇంట్లో ఏం జరిగినా మీకు తెలీదు. అయినా మమ్మల్ని పట్టించుకునేంత తీరిక మీకు ఎక్కడిది?"

నాకేమీ అర్థం కాలేదు. నేనేం చేశానని రాఘవ నిష్ఠూరంగా మాట్లాడుతున్నాడో అస్సలు అర్థం కాలేదు.

"నేనేం చేశాను?"

"నాని ఇంతవరకూ ఇంటికి రాలేదు. మేం కంగారు పడుతుంటే మీరు మాత్రం తీరిగ్గా వచ్చి ఏం జరిగిందని అడుగుతుంటే ఏమనుకోవాలి?"

"అదేమిటి? రోజూ నువ్వే వాడిని స్కూల్ నుండి తీసుకొస్తావు కదా?"


"అవును. రోజూ ఆఫీసు నాలుగ్గంటలకే అయిపోతుంది కనుక వాడిని తీసుకొస్తాను. ఈ రోజు అనుకోకుండా నాకు లేటయింది. నేను వెళ్లేసరికి వాడక్కడ లేడు. వెళ్లిపోయాడని వాచ్‌మెన్ చెప్పాడు. మిగిలిన పిల్లలతో కలిసి వచ్చేసుంటాడనుకున్నాను. కానీ రాలేదు."

రాఘవ అలా చెప్పగానే బావురుమంది మహాలక్ష్మి.

నాక్కూడా కొంచెం కంగారు కలిగింది. ఈ ఊళ్లో

## విలన్‌గా అబ్బాస్

దాదాపు తొమ్మిదేళ్ల క్రితం వచ్చిన 'ప్రేమదేశం' లాంటి బంపర్ హిట్ చిత్రంలో నటించిన స్మార్ట్ హీరో అబ్బాస్ ఆ తర్వాత తారా పథంలో అంతగా దూసుకెళ్లలేకపోయాడు. అందుకనేమో ఇప్పుడు తన రూటు మారుస్తున్నాడు. విలన్‌గా తొలిసారిగా ఓ తెలుగు సినిమాలో నటిస్తున్నాడు. యువ హీరో నితిన్ హీరోగా ఇటీవలే ప్రారంభమైన తెలుగు చిత్రంలో విలన్‌గా నటిస్తున్న అబ్బాస్‌కి ఈ కెరీర్ ఎలా కలిసొస్తుందో చూడాలి!



స్కూల్లేకపోవటం వల్ల వాడిని ప్రక్కూళ్లో జాయిన్ చేశాం. రోజూ రాఘవే స్కూలుకి తీసుకెళ్తాడు. నాలుగ్గంటలకి వాడిని తీసుకుని ఇంటికి వస్తాడు. ఎప్పుడూ ఇలా జరగలేదు.

"కంగారు పడకమ్మా. మూడు మైళ్లు నడిచి రావాలి. చిన్నపిల్లలు కదా నడవలేక ఎక్కడైనా ఆగి ఉంటారు. మేం వెళ్లి చూసొస్తాం."

మహాలక్ష్మికి ధైర్యం చెప్పి రాఘవను తీసుకుని బయటికొచ్చాను. అదే స్కూల్లో చదువుతున్న మిగిలిన పిల్లల ఇళ్లకు వెళ్లాం. అందరూ వచ్చేశారు. నాని గురించి అడిగితే ఎవరూ చూడలేదన్నారు. వాడెపుడూ వాళ్ల డాడీతో వస్తాడు గనుక మేం పట్టించుకోమని కూడా అన్నారు. ఎందుకో నా మనసులో చిన్న కలకలం మొదలైంది. రాఘవ సంగతి చెప్పక్కర్లేదు. కంగారంతా ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

నాకేం చెయ్యాలో పాలుపోలేదు. ఆలోచిస్తూ నిలబడిపోయాను.

"నాన్నా అటు చూడండి" అరిచినట్లే అన్నాడు రాఘవ.

దూరంగా చెరువుగట్టు మీద ఉన్న వీరయ్య ఇంటిముందు జనం గుమిగూడారు. ఇద్దరం అటువైపు పరు

గుతీశాం. జనాన్ని తప్పించుకుంటూ లోపలికి వెళ్లిన మేము అక్కడి దృశ్యం చూసి స్థాణువులై నిలబడి పోయాం.

ఇరుకుగా ఉన్న ఆ గుడిసెలో నులకమంచం మీద స్పృహ లేకుండా పడి ఉంది వీరయ్య కూతురు లక్ష్మి. ఆ పక్కనే కూర్చుని బిత్తర చూపులు చూస్తున్నాడు నాని. మమ్మల్ని చూడగానే పరుగున మా దగ్గరికొచ్చాడు.

కొడుకుని దగ్గరికి తీసుకుని ముద్దులాడాడు. ఇక్కడెం దుకున్నావని అడిగినా వాడు చెప్పలేదు. భయం భయంగా లక్ష్మి వైపు చూస్తున్నాడు.

లక్ష్మికేమైందని డాక్టర్‌ని అడిగాను.

"మీకు తెలియదా మాస్టారూ. ఇందాక మీ మనవడు పొలం గట్టుమీద నడుచుకుంటూ వస్తుంటే పాము కాటేసిందట. గోరింటాకు కోసం అక్కడికెళ్లిన లక్ష్మి అది చూసి నోటితో విషాన్ని లాగేసి బాబుని కాపాడిందట. కానీ అనుకోకుండా కొంత విషం మింగేసింది"

డాక్టర్ మాటలు చెవులను తాకగానే నా మెదడు మొద్దుబారిపోయింది. కాలికింది భూమి కంపించినట్ల యింది.

"ఇప్పుడు లక్ష్మికెలా ఉంది డాక్టర్?" నాకు తెలియ కుండానే నా గొంతు భయంతో వణికింది.

"పరిస్థితి చెయ్యిదాటిపోయింది మాస్టారూ. నన్ను ఇంకొంచెం ముందు పిలిచినా నా ప్రయత్నం నేను చేసుండేవాడిని. నేను వచ్చేసరికే విషం ఒళ్లంతా పాకింది."

'భగవంతుడా ఏమిటిది. రెండురోజుల్లో పెళ్లికూతురు కావాల్సిన పిల్ల, నా ఇంటి వారసుణ్ణి కాపాడి తన ఇంటిలో మరణశయ్యపై పడి ఉంది. ఇప్పుడు నేనేం చెయ్యను. వీరయ్యనెలా ఓదార్చను?'

నా నరనరాలను అంతులేని ఆవేదన నిప్పులా కాల్చే స్తోంది.

లక్ష్మి మంచం పక్కనే కూర్చుని దీనంగా కూతురి ముఖంలోకి చూస్తున్నాడు వీరయ్య. ఆ చూపుల్లో శూన్యత్వం నన్ను కలచివేస్తోంది. దగ్గరికెళ్లి భుజం మీద చెయ్యి వేశాను. లేచి మౌనంగా నిలబడ్డాడు.

"నన్ను క్షమించు వీరయ్యా. నా వల్ల నా కుటుంబం వల్లే నీకీ కష్టం కలిగింది. దయచేసి నన్ను క్షమించు"

నా మాటలు పూర్తి కాకుండానే ఠక్కున నా చేతులు పట్టుకున్నాడు.

"అలా అనకండయ్యగారు. నోరు తెరిచి అడక్కుండానే ఎదుటి మడిసి మనసెరిగి ఆళ్ల అవసరాలు తీరుస్తారు. ఎన్నో కుటుం బాల్లో దీపమెట్టిన దేవుడు మీరు. ఈ ఊళ్లో మీ సాయం పొందని మడిసే లేదు. కానీ ఆల్లెవరికీ దక్కని అదృష్టం నా కూతురికి దక్కింది. మీ మనవడికి పేణం పోసి మీ రునం తీర్చుకుంది నా బిడ్డ. అది సేసినదా నికి నాకు చానా గర్వంగా ఉందయ్య గారూ, చానా గర్వంగా ఉంది."

అంతటి అభిమానాన్ని మోయలేక నా గుండె భారమ య్యింది.

"నీదెంత గొప్ప మనసు వీరయ్యా. లక్ష్మినిప్పుడే పట్నం తీసుకెళ్దాం. ఎంత ఖర్చయినా తనని బతికించు కుందాం" ఆవేశంగా అన్నాను.

"ఆ అవసరం లేదు మాస్టారూ. ఆమె ఊపిరి ఆగిపో యింది" మెల్లగా అన్నాడు డాక్టర్.

"అమ్మా లక్ష్మీ" నరాలు తెగిపోయేలా అరిచాడు వీరయ్య. అంతవరకూ అణచి పెట్టిన ఆవేదన అతని గుండెగోడల్ని బద్దలుకొట్టి బయటకు వచ్చింది. కూతురి శవం మీద పడి కుమిలి కుమిలి ఏడవసాగాడు.

పాపం వీరయ్య. పదేళ్ల క్రితమే తన భార్య చనిపో యింది. అప్పటి నుండీ కూతురే అతని ప్రపంచం. ఆమె పెళ్లి కోసం రెక్కలు ముక్కలు చేసుకుని పైసా పైసా కూడబెట్టాడు. ఇంతలోనే అంతా అయిపోయింది.

ఓదార్చితే అతని బాధ తీరదు సరికదా మరింత పెరు గుతుంది. అందుకే అతణ్ణి ఓదార్చే ప్రయత్నం చేయలేక పోయాను.

వేళ మించిపోతూండటంతో మిగిలిన వారి సాయంతో జరగాల్సిన దానికి అన్ని ఏర్పాట్లూ చేశాను. చీకటి పడక ముందే లక్ష్మి దహన సంస్కారాలు పూర్తయ్యాయి. అందరూ వెళ్లిపోయారు. రాఘవ, నేనూ అక్కడే ఉన్నాం.


కూతురి చితివైపు కళ్లార్పకుండా చూస్తున్నాడు వీరయ్య. నిర్జీవమైన ఆ చూపులు నా మనసును మెలి పెడుతున్నాయి. చితి పూర్తిగా కాలి మంటలు ఆరి పోయే వరకూ అలాగే కూర్చున్నాడు. అతని కళ్లు అవి శ్రాంతంగా వర్షిస్తూనే ఉన్నాయి.

"వెళ్దాంలే వీరయ్యా" అన్నాను.

అతడు లేవలేదు.

"నేను రానయ్యగారూ. నా బంగారు తల్లి నన్నొంట రోణ్ణి చేసి వెళ్లిపోయింది. నా ఇంటి దీపమే ఆరిపోయిన పుడు నేనా ఇంట్లో ఉన్నా, వల్లకాట్లో ఉన్నా ఒకటే అయ్య గారూ."

నాకేం మాట్లాడాలో, ఏం చెప్పి అతనిని ఓదార్చాలో అర్థం కావడం లేదు. ఏం చేసినా ఎంత చెప్పినా అతని గుండె బరువు తీరుతుందా?




అంతవరకూ అన్నీ చూస్తూ మౌనంగా ఉన్న రాఘవ అడుగులో అడుగు వేసుకుంటూ మా దగ్గరికొచ్చాడు. భుజాలు పట్టి వీరయ్యను పైకి లేపాడు.

"పద వీరయ్యా వెళ్దాం. నీ కూతురు నిన్ను ఒంటరివా డిని చేసి వెళ్లిపోలేదు. వెళ్తూ వెళ్తూ నీకొక కొడుకునిచ్చి వెళ్లింది."

అయోమయంగా చూశాడు వీరయ్య. అతనికే కాదు రాఘవ మాటలు నాకూ అర్థం కాలేదు.

"ఏంటి వీరయ్యా అలా చూస్తున్నావ్. నేనొక చదువు కున్న మూర్ఖుడిని. కన్నతండ్రిని కూడా అర్థం చేసుకోలేని అంధుడిని. ఆయన మంచిమనసును అవమానకర మైన మాటలతో అనుక్షణం తూట్లు పొడిచాను. ఆ మానవతామూర్తిని అవహేళన చేశాను. అందరికీ అన్నీ ధారపోసి ఈయనేం సంపాదిస్తాడని నవ్వాను. ఆయనేం సంపాదించారో ఇప్పుడు అర్థమయింది. తన కోసం, తన వారి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసే మీలాంటి మంచి మనసులను సంపాదించుకున్నారు. ఎదుటివారి కష్టాలు చూసి చలించినపుడు ఆయన కళ్లలో కరిగిన కన్నీరే ఈ రోజు నన్ను కన్నీటిపాలు కాకుండా కాపాడింది. సాటి మనిషి కోసం సర్వస్వాన్ని త్యాగం చేశాడు నా తండ్రి. నా బిడ్డకు ప్రాణం పోయటానికి తను ప్రాణత్యాగం చేసింది లక్ష్మి. కూతురు చావు ఒడిలోకి జారిపోతున్నా బాధపడకుండా నా తండ్రి రుణం తీర్చుకున్నందుకు గర్వంగా ఉందని చెప్పి అభిమానానికి అర్థం చెప్పావు నువ్వు. మీ అందరి మంచితనాన్ని చూసి నా అణువ ణువూ సిగ్గుతో చితికిపోతోంది. ఎదుటివారి కోసం ఒక కన్నీటిబొట్టు రాల్చలేని మనిషి జీవితం వ్యర్థమని నా తండ్రి చెప్పిన మాటల విలువ నాకిపుడు తెలిసింది. ఆయనకు తగిన కొడుకును కాలేకపోయాను. నన్నింత వాణ్ణి చేసిన ఆయన రుణమెలాగూ తీర్చుకోలేకపో యాను. నా ఇంటిలో దీపం వెలిగించి చీకటిలో నిలబడిన నీకు కొడుకుగా మారి నీ రుణమైనా తీర్చుకుంటాను. ఈ ప్రపంచంలో ప్రతి మనిషికీ ఒక్కడే తండ్రి ఉంటాడు. కానీ నాకు ఇద్దరు తండ్రులు. ఒకరు జన్మనిచ్చిన తండ్రి. మరొకరు మంచితనం, మానవత్వం విలువ తెలియ జేసి, ఒక మంచి మనిషిగా నాకు పునర్జన్మనిచ్చిన తండ్రి. పద వెళ్దాం. నువ్విప్పుడు ఒంటరివాడివి కాదు. నీకో కొడు కున్నాడు."

ఒక చెయ్యి నా భుజం మీద, మరొక చెయ్యి వీరయ్య భుజం మీద వేసి ముందుకు నడిపిస్తున్న నా కొడుకు ముఖం లోకి చూశాను. మొట్టమొదటిసారిగా వాడి కళ్లలో మానవత్వపు ఛాయలు, మమతాను రాగాల జాడలు కనిపించాయి నాకు. పుత్రో త్సాహంతో నా మనసు ఆనంద తాండవం చేస్తుంది. వాడి భుజం మీద తలవాల్చి తృప్తిగా ముందుకు నడిచాను.